నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 8 జూలై 2024 | KHAMMAM

# దుర్మార్గపు పాలనకు ప్రభాకర్ బలయ్యాడు

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

చింతకాని, జూలై 7 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ దుర్మార్గపు, అసమర్థ పాలనతో రైతు ప్రభాకర్ బలయ్యాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఆదివారం మండలంలోని ప్రొద్దుటూరులో పెంట్యాల పుల్లయ్య నివాసానికి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం, ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రభాకర్‌కు 7ఎకరాల 10 గుంటలకు పట్టా ఇచ్చి రైతు బంధు డబ్బులు 11సార్లు చెల్లించారన్నారు. రైతులందరికీ విషయం తెలుసునని అన్నారు. తన పంట పొలాన్ని ప్రొక్లెయిన్‌ల ద్వారా కొందరు వ్యక్తులు ధ్వంసం చేస్తున్నా.. రైతులు ప్రేక్షకుల్లా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క గెలుపులో ప్రభాకర్ కుటుంబం పాలుపంచుకున్నట్లు వీడియో ద్వారా ప్రభాకర్ చెప్పాడని అన్నారు. ప్రభాకర్ కుటుంబ పరామర్శకు వచ్చిన భట్టి నిందితుని ఇంటికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని అయినా పార్టీ పరంగా ఎదుర్కొంటామన్నారు. ప్రభాకర్ కుటుంబం బీఆర్ఎస్ పార్టీ కాకపోయినా న్యాయం కోసం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన పెంట్యాల పుల్లయ్యపై A3గా కేసు నమోదుచేయడమే కాకుండా అసలు పాత్రధారి అయిన వ్యక్తిని A12లో నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లో కేసు దరఖాస్తు రాసిన పెంట్యాల నాగుల్‌మీరాను A1గా నమోదుచేశారన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని అప్పుడు చర్యలుంటాయని అన్నారు. జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ.. బాధిత రైతు ప్రభాకర్ కుటుంబానికి అండగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాష్ట్ర నాయకులు రాకేశ్‌రెడ్డి, ఆర్జేసీ కృష్ణ, పగడాల నాగరాజు, బెల్లం వేణు, రమణ, చిత్తారు నాగేశ్వరరావు, గురజాల హనుమంతరావు, మంకెన రమేష్, గడ్డం శ్రీనివాసరావు, బోడ్డు వెంకట్రామారావు, బండి రామారావు, వేముల నర్సయ్య, పిన్నెల్లి శ్రీను, కోల్లి బాబు, పలు మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ బృందం



ఆర్థికసాయం చేస్తున్న రాష్ట్ర ప్రతినిధి బృందం సభ్యులు, నాయకులు

## రూ.2లక్షల నగదు అందజేత

చింతకాని, జూలై 7 : మండలంలోని ప్రొద్దుటూరు ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర బృందం ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రభాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ముందుగా ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ పొలంలో జరిగిన అన్యాయాన్ని వివరించారు. తమకు న్యాయం చేసేలా చేయాలని ప్రభాకర్ తండ్రి పెద్దవీరయ్య నాయకులను కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రతినిధి బృందం సభ్యులు మాట్లాడుతూ.. బాధితుల పక్షాన బీఆర్ఎస్ మండలస్థాయిలో, జిల్లా స్థాయిలో నిలుస్తుందని, అసెంబ్లీలో సైతం ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభాకర్ కుటుంబానికి ప్రభుత్వం తరపున అందించే పరిహారం వచ్చేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.


### బాధిత కుటుంబానికి రూ.2లక్షల నగదు అందజేత..

ఆత్మహత్య చేసుకున్న ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ బృందం రూ.2లక్షల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ప్రజలు, రైతుల తరపున తాము పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఏస్ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులున్నారు.

# పొలం మధ్యలో గాడి కొట్టడం దుర్మార్గం

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## రైతు పొలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి బృందం



ప్రభాకర్ పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధి బృందం

చింతకాని, జూలై 7 : ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ పొలాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రతినిధి బృంద సభ్యులు ఆదివారం పరిశీలించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రభాకర్ పొలాన్ని, అక్కడ జరిగిన తవ్వకాలను, మట్టి తరలింపు, బాట తొలగింపు.. తదితర అంశాలను బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభాకర్ మృతి అంశంలో కొనసాగుతున్న దర్యాప్తులో డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క తన విశ్వసనీయత నిరూపించుకోవాలని, ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలన్నారు. ప్రభాకర్ పొలం మధ్యలో గాడి కొట్టడం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి ప్రభాకర్ 7 ఎకరాల 10 గుంటలకు హద్దులు నిర్ణయించడంతోపాటు రహదారిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పొలం మధ్యలో గండి కొట్టడం హేయమైన చర్య అని, ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఏ అండ చూసుకొని దుండగులు గాడి కొట్టారో అందరికీ అర్థమవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ తరపున ప్రభాకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, అధికార పార్టీ నాయకులు అక్రమార్కులకు అండగా నిలవడం దుర్మార్గమని విమర్శించారు. తనకు ఎలాంటి న్యాయం జరగదన్న కారణంతోనే రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని, కానీ ఆత్మహత్యలే ప్రతి సమస్య పరిష్కారం కావని, రాష్ట్రంలో ఉన్న రైతుల పక్షాన, రైతు సమస్యల పట్ల బీఆర్ఎస్ అండగా ఉంటూ ప్రభుత్వంపై పోరాడుతుందని తెలిపారు.

# రైతులకు అన్యాయం చేస్తే అగ్గిపుట్టిస్తాం

- రేవంత్ సర్కార్‌లో అధికారులంతా లంచగొండులుగా తయారైన్రు
- తహసీల్దార్, సీఐని కలిసినా స్పందించకపోవడంతోనే ప్రభాకర్ ఆత్మహత్య
- 40ఏళ్లుగా భూమిని సేద్యం చేసుకుంటున్న ప్రభాకర్
- డిప్యూటీ సీఎం నిందితుడి దగ్గరికెళ్లి కలవడం బాధాకరం
- ప్రభాకర్ కుటుంబానికి అండగా నిలుస్తాం
- విలేకరుల సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా, పక్కన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర, ఆర్జేసీ కృష్ణ



ప్రభాకర్ కుమారుడిని ఓదార్చుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్


ఖమ్మం, జూలై 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలోని ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా అగ్గిపుట్టిస్తామని జనగామ శాసనసభ్యులు, బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి రేవంత్ సర్కార్‌ను హెచ్చరించారు. ఖమ్మంజిల్లాలోని చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ బృందంతో కలిసి పరామర్శించారు. అనంతరం మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శాసన మండలి సభ్యుడు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. తన భూమిని కాపాడమని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోకపోవడం వల్లనే ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో రెవెన్యూశాఖలో అవినీతి పెట్రేగిపోయిందని, అధికారులు డబ్బులు లేకుండా ఏ పనీ చేయడం లేదని, సాక్షాత్తు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమను ఏమీ అనరనే ఉద్దేశంతో రెవెన్యూ ఉద్యోగులు ప్రజలను పట్టి పీడిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పలువురు మంత్రులు రెండుచేతులతో కాకుండా నాలుగు చేతులతో సంపాదిస్తున్నారని.. అందులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒకరని విమర్శించారు. రేవంత్ సర్కార్ విధ్వంసకర కార్యక్రమాలు చేస్తున్న వారికి మద్దతుగా నిలుస్తోందని మండిపడ్డారు. ప్రభాకర్ తన భూమిని 40ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడని, ధరణి పాస్ పుస్తకం కలిగి ఉండి 11సార్లు రైతుబంధు పొందినట్లు తెలిపారు. భూమికి కావాల్సిన అన్ని రకాల ఆధారాలను ప్రభాకర్ కలిగి ఉన్నాడన్నారు. ఐనప్పటికీ ప్రభాకర్ భూమికి ట్రెంచ్ కొట్టి చెరువులో కలపడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. చట్టబద్ధంగా ఉన్న ప్రభాకర్‌కు చెందిన 7.10 కరాలను రక్షించలేని రెవెన్యూ యంత్రాంగం ఎందుకుని పల్లా ప్రశ్నించారు. ప్రభాకర్ ఆత్మహత్య చేసుకొని వారంరోజులైనా బాధితులను కలిసి పరామర్శించాల్సిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తాను, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు వస్తున్నామని తెలిసి కంటితుడుపు చర్యగా వచ్చి వెంటనే తిరిగి నిందితులను కలిసి వెళ్లడం బాధాకరమన్నారు. బోజడ్ల ప్రభాకర్ కుటుంబానికి వారి 7.10 ఎకరాల భూమి కచ్చితంగా చెందేవిధంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పల్లా డిమాండ్ చేశారు. ప్రభాకర్ ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా ఆత్మహత్యకు కారణమైన తహసీల్దార్, సీఐను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి పిల్లలకు అండగా నిలవాలన్నారు. చనిపోయిన రోజు బాధిత కుటుంబాన్ని నిందితుల పేర్లు చెప్పొద్దంటూ పోలీసులు ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమైన విషయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేకమార్లు చింతకాని మండలానికి వచ్చారని, దళితబంధు పథకాన్ని సైతం ఇక్కడి నుంచే పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారణమై ఏ-1గా ఉండాల్సిన నిందితుడిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన కారులో తిప్పుకోవడం సిగ్గుచేటు చర్యగా మండిపడ్డారు. ఏమాత్రం సంబంధం లేని, గ్రామానికి పెద్దగా ఉన్న పుల్లయ్యపై కేసు పెట్టించి ఇబ్బందులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. అన్యాయంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెడితే మాత్రం సహించేది లేదని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని దీనిని ఏమాత్రం సహించమన్నారు. మీరు చేసే అన్యాయాల చిట్టాలను రాసుకొని తిరిగి మేం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఊడగొడతామని హెచ్చరించారు. ప్రభాకర్ కుటంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని పల్లా భరోసా కల్పించారు.



ప్రభాకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ బృందం

# ప్రభాకర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

- నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ నేతలపై కేసులు
- చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిపై కేసు ఎత్తివేయాలి
- కాంగ్రెస్ నేత కూరపాటి కిషోర్ ప్రమేయంపై లోతైన విచారణ జరపాలి
- ఖమ్మం సీపీకి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం విజ్ఞప్తి



నిందితులను శిక్షించాలని సీపీకి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ బృందం, నాయకులు

ఖమ్మం, జూలై 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భూ వ్యవహారంలో తనకు న్యాయం జరగడం లేదని ఆవేదనకు లోనై ఆత్మహత్యకు పాల్పడిన రైతు బోజడ్ల ప్రభాకర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను చట్టపరంగా శిక్షించాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కోరింది. ఈ మేరకు ఆదివారం ఖమ్మం నగరంలోని సీపీ కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు, ప్రేరేపించిన అంశాలు, కేసుల నమోదులో జరిగిన పరిణామాలు వంటి అంశాలను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోదాహరణంగా వివరించారు. బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కొద్దిసేపటికి ముందు ఆత్మహత్యకు కారణాలను వివరిస్తూ అందుకు కారకులైన వారి పేర్లను వీడియో ద్వారా వెల్లడించారని, కాంగ్రెస్ నాయకుడు కూరపాటి కిషోర్ ప్రమేయాన్ని, తన వల్ల జరిగిన ఇబ్బందిని వివరించాడని, అయితే పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో 12వ పేరుగా నమోదు చేశారని అన్నారు. ప్రభాకర్ తరఫున కలెక్టర్‌ను కలవడానికి తనతోపాటు రావాలని ప్రభాకర్ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పుల్లయ్య, నాగుల్‌మీరాను కలెక్టరేట్‌లో కనిపించగా కోరారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా కక్ష పూరితంగా తమ పార్టీకి చెందిన నాయకులను ఏ-1, ఏ-3లుగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడం రాజకీయ దురుద్దేశమే అని నిరంజన్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీపీ సునీల్‌దత్‌కు వివరించారు. పెద్ద మనిషిగా వెళ్లిన పుల్లయ్యపై కేసు నమోదు చేయడం అత్యంత దారుణమని, అతడిపై కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ వ్యవసాయ భూమికి ఆనుకుని ఉన్న చెరువులో చేపపిల్లల పెంపకం అధికారికంగా ఏనాడూ జరగలేదని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. తహసీల్దార్, ఎస్ఐలు ప్రభాకర్ విజ్ఞప్తిని పట్టించుకుపోవడం వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని నిరంజన్‌రెడ్డి వివరించారు. 11సార్లు రైతుబంధు అందుకున్న ప్రభాకర్ ఇది తన భూమేనని నిరూపించుకోవాలన్న అవసరం ఏమొచ్చిందని అన్నారు. ప్రజాప్రతినిధుల బృందం లేవనెత్తిన అంశాలను కూలంకుషంగా విన్న సీపీ ప్రభాకర్ మృతిపై లోతైన విచారణ జరుపుతామని నిందితులు ఎవరైనాసరే శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పగడాల నాగరాజు, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, బ్రహ్మయ్య, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్ పాల్గొన్నారు.

# నమస్తే వార్తకు స్పందించిన ప్రభుత్వం

## ప్రొద్దుటూరుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, జూలై 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వారంరోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరామర్శ కొరవడిందని, రైతు కుటుంబం పడుతున్న ఇబ్బందులపై కనీసం పలకరించిన పాపానపోలేదని 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఆదివారం వచ్చిన వార్తకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆదివారం ఖమ్మంజిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క వెళ్లి ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. తన అధికారిక పర్యటన షెడ్యూల్‌లో చింతకాని మండల పర్యటన కానీ, ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించే అంశం కానీ లేకపోయినప్పటికీ ఆదివారం ఖమ్మంజిల్లా పర్యటనకు వస్తూనే ఆగమేఘాల మీద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. రైతు ప్రభాకర్ తల్లిదండ్రులు, ప్రభాకర్ భార్య, కుమార్తె, కుమారును భట్టి ఓదార్చారు. ప్రభాకర్ జూలై 1వ తేదీన ఆత్మహత్య చేసుకోగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పరామర్శ కరువైందని, ప్రభాకర్ మరణంతో కుటుంబం పెద్దదిక్కు కోల్పోయిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ తండ్రి వీరభద్రయ్య పడుతున్న ఆవేదనను 'నమస్తే తెలంగాణ' ఆదివారం సవివరంగా ప్రచురించింది. అధికార పార్టీకి చెందిన నేతలెవరూ ప్రభాకర్ కుటుంబం వైపు కన్నెత్తి చూడకపోవడం జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభాకర్ కుటుంబం పడుతున్న గోసను చూసే ప్రయత్నం చేయకపోవడంపై వచ్చిన కథనంపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారు ఎంతటివారైనా సరే సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన భట్టి విక్రమార్క అనంతరం ప్రభాకర్ మృతి కేసులో నిందితుడిగా ఉన్న అదే గ్రామంలోని కాంగ్రెస్ నాయకుడు కూరపాటి కిషోర్ ఇంటికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అలాగే ప్రభాకర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం ఆదివారం పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల నగదు అందించారు.

### బీఆర్ఎస్ ప్రతినిధుల బృందానికి తప్పని నిరీక్షణ

ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ శనివారం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పార్టీ ప్రజాప్రతినిధుల బృందాన్ని ఎంపిక చేసింది.ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు ప్రభాకర్ కుటుంబసభ్యులతోపాటు రెవెన్యూ, పోలీస్ అధికారులకు పర్యటనపై ముందస్తు సమాచారం అందించారు. ఉదయం 9:30 గంటలకు గ్రామానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధంకాగా డిప్యూటీ సీఎం వస్తున్నారని కొంత సమయం వేచి ఉండాలని పోలీసులు సూచించడంతో దాదాపు రెండుగంటల పాటు వారు పార్టీ కార్యాలయంలో నిరీక్షించారు. మల్లు భట్టి విక్రమార్క పరామర్శ కొనసాగుతుండడంతో బీఆర్ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తాతా మధుసూదన్, లింగాల కమల్‌రాజు, సండ్ర వెంకటవీరయ్య, పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్ తదితరులు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# భరోసా ఇవ్వని 'భట్టి'

- రైతు ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన డిప్యూటీ సీఎం
- కనీసం ఎక్స్‌గ్రేషియా ప్రకటన లేదు
- పైగా నిందితుడి ఇంటికీ వెళ్లిన భట్టి విక్రమార్క
- కిశోర్‌ను అరెస్టు చేయకపోవడంపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



ప్రభాకర్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర, జూలై 7 : రైతు ప్రభాకర్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపించింది. కొండంత ఆశతో ఎదురుచూస్తున్న ఆ కుటుంబ సభ్యులకు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించకుండానే వెనుదిరిగారు. వివరాల్లోకెళ్తే.. ఖమ్మంజిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ ఈ నెల 1వ తేదీన ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. వారంరోజులుగా పలు పార్టీల నేతలు, సంఘాల నాయకులు ఆ రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్నారు.. కానీ మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం అయిన భట్టి విక్రమార్క మాత్రం వారంరోజుల తర్వాత ఆదివారం ప్రొద్దుటూరు గ్రామానికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ రైతు కుటుంబాన్ని పరామర్శించి వారి నుంచి వివరాలు సేకరించారు. కాసేపటికి భట్టి విక్రమార్క వచ్చి ప్రభాకర్ తండ్రి పెద్ద వీరయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ తండ్రి మాట్లాడుతూ తమ భూమికి సంబంధించిన హద్దులు, హక్కులు, దారి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమికి హద్దులను ఏర్పాటు చేస్తామని, దారి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎంను చూడగానే పెద్దవీరయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభాకర్ పిల్లలు చిన్నవారని, తాను వృద్ధాప్యంలో ఉన్నానని ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ప్రాధేయపడ్డాడు. కానీ భట్టి మాత్రం ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదు.. ప్రభాకర్ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివియ్యాలని కలెక్టర్‌ను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పర్యటనకు వైరా సబ్ డివిజన్ ఏసీపీ రెహమాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### నిందితులను ఉపేక్షించేది లేదు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రైతు ప్రభాకర్ మృతికి కారణమైన వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నాసరే ఉపేక్షించేదిలేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పరామర్శ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతు మరణం చాలా బాధాకరమని, ఆత్మహత్యలే సమస్యలకు పరిష్కారం కావని అన్నారు. ప్రభాకర్ ఆత్మహత్యకు ప్రేరేపించిన అంశాలు, దారితీసిన పరిస్థితులను సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. అందరూ మా వాళ్లే.. నా వాళ్లే అని చెప్పి దోషులను వదిలిపెట్టేదిలేదని అన్నారు.

### నిందితుడి ఇంటికి వెళ్లిన భట్టి..

ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించిన తక్షణమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అదే ప్రభాకర్ మృతి విషయంలో నిందితుడిగా ఉన్న కూరపాటి కిషోర్ ఇంటికి వెళ్లి అక్కడ ఆ పార్టీ నాయకులతో కొద్దిసేపు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. భట్టి తన ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న కిషోర్ పోలీసుల మధ్యనుంచే స్వేచ్ఛగా నడుచుకుంటూ భట్టి దగ్గరకు వెళ్లడం గమనార్హం. అనంతరం కిషోర్ ఇంటి నుంచి భట్టి వెళ్లిపోయాడు. అయితే అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నప్పటికీ నిందితుడైన కిశోర్‌ను మాత్రం అరెస్టు చేయకపోవడం ఏమిటని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఫ్లెక్సీ ఏర్పాటు..

మా భవిష్యత్తుకు న్యాయం చేయండంటూ ప్రభాకర్ కుమారుడు, కుమార్తె తమ ఇంటి ముందు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. తన తండ్రి ప్రభాకర్ మందు డబ్బా పట్టుకొని ఏడుస్తూ ఉన్న ఫొటోతోపాటు పిల్లలిద్దరూ దండం పెడుతూ ఆలోచింపజేసేలా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.